

ఎర్రవల్లి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, విపక్షనేత మధుసూధనాచారి, బీఆర్ఎస్ రాజ్యసభాపక్షనేత సురేశ్‌రెడ్డి, మాజీమంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్

# ఏప్రిల్ 27న ఓరుగల్లులో సభ!

మొదటిపేజీ తరువాయి...

దశాబ్దాలపాటు పోరాటాలు నడిపి ఎన్నో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని, పదేండ్లపాటు ఎంతో అప్రమత్తతో పాలన సాగించి దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని, అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం ఇవాళ కష్టాల్లో ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కంకణబద్ధులమై మరింతగా పోరాడుదామని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవాలు బీఆర్ఎస్‌కే పరిమితం కాదని, యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం ఉన్నదని స్పష్టంచేశారు.

### తెలంగాణకు కేంద్రం వ్యతిరేకమే

కేంద్రం ప్రభుత్వంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా తెలంగాణ సమాజానికి మొదటినుంచీ అవి వ్యతిరేకంగానే పని చేస్తున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసుకొని దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తతతో ఉండాలని సమావేశంలో పార్టీ నిర్ణయించింది. తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో లేకపోవడం వల్ల తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతున్నదని అభిప్రాయపడింది. ఇదే విషయం ప్రజలకు మరింతగా బోధపడేలా పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీల ప్రాతినిధ్యం ఉండి రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించింది. ఎనిమిది గంటలపాటు సాగిన సుదీర్ఘచర్చలో తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ అధ్యక్షతన సాగిన సమావేశం నిర్ణయించింది.

### కాంగ్రెస్ పాలనలో తెర్లవుతున్న తెలంగాణ

చర్చ సందర్భగా పలు అంశాలపై కేసీఆర్ అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నేతలు తమ అభిప్రాయాలను అధినేత ముందుంచారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఉమ్మడి పాలన తరహాలో మళ్లీ కరెంట్ కోతలు, తాగునీటి కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించపోవడంతో కాంట్రాక్టర్లు సచివాలయంలో డిప్యూటీ సీఎం చాంబర్ ఎదుట ఆందోళన చేసే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన దుస్థితి దాపురించిందని చెప్పారు. ఆదాయ రాబడిలో తెలంగాణను మనం నంబర్‌వన్‌గా తీర్చిదిద్దితే, నేడు రియల్ ఎస్టేట్ నేల కరించిందని తెలిపారు. సాగునీళ్లు అందక పచ్చని పంటలు ఎండిపోవడాన్ని చూసి తట్టుకోలేక రైతులు ఎడ్చే దారుణ పరిస్థితి కాంగ్రెస్ రాజ్యంలో నెలకొన్నదని నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు.


## యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలి

పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంతోపాటు దేశంలో వర్తమాన రాజకీయ పరిస్థితులు, అందుకనుగుణంగా పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు, అమలుచేయాల్సిన రాజకీయ ఎత్తుగడలపై లోతైన చర్చ జరిగింది. గత ఒడిదొడుకులను, అనుభవాలను పరిగణలోకి తీసుకుని విశ్లేషిస్తూ, వర్తమానానికి అన్వయించుకుంటూ భవిష్యత్తుకు బాటలువేసుకునేలా కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు.

## రాష్ట్రవ్యాప్తంగా కొత్త కమిటీలు

కాంగ్రెస్ ఆశపెట్టిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను నమ్మిన ప్రజలు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని తెలుసుకున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ చెప్పారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని తెలిపారు. సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాలవారీగా నిర్వహించాలని, అందుకు త్వరలో కమిటీలను వేయనున్నామని కేసీఆర్ చెప్పారు. వరంగల్ సభ తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి, కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం నూతన కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను నిర్వహించనున్నట్టు కేసీఆర్ వెల్లడించారు.

## లోకం పోకడ





ఎర్రవల్లిలో సమావేశానికి హాజరైన మాజీమంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, లక్ష్మారెడ్డి, పద్మారావుగౌడ్, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, దేశపతి శ్రీనివాస్, తాతా మధు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుభాష్‌రెడ్డి, వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నేతలు ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్

# ఇది 20% కమీషన్ సర్కార్!

మొదటిపేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ధర్నా చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతిపత్రం ఇచ్చేందుకు సచివాలయానికి వచ్చిన కాంట్రాక్టర్లకు భట్టి ముఖం చాటేశారు. కనీసం వారి వినతిని వినేందుకు కూడా ఇష్టపడలేదు. ఎస్పీఎఫ్ సిబ్బంది కాంట్రాక్టర్లను అడ్డుకోవడంతో వారంతా భట్టి చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు.

### భట్టివిక్రమార్క పలాయనం

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది సివిల్ కాంట్రాక్టర్లు భట్టివిక్రమార్కను కలిసేందుకు శుక్రవారం మధ్యాహ్నం సచివాలయానికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎం భద్రతా సిబ్బందితోపాటు సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలు చూసే ఎస్పీఎఫ్ సిబ్బంది కూడా వీరిని అనుమతించలేదు. ఆగ్రహించిన కాంట్రాక్టర్లు భట్టి చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టుగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల ఆందోళనను గమనించిన భట్టి వారి దగ్గరికి వచ్చి భరోసా కల్పించాల్సింది పోయి.. సెక్రటేరియట్ నుంచి వెళ్లిపోయారు.

### బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదు:భట్టి

ప్రభుత్వ ఉద్యోగులు వారి బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదని, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 14 నెలల కాలంలో కొన్ని బకాయిలు జమ చేశామని తెలిపారు. పాత, కొత్త పెండింగ్ బిల్లులు రూ.10వేల కోట్లు తమ ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. మరో రూ.8 వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి ప్రాధాన్య క్రమంలో ప్రతినెలా రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చాంబర్ ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లతో పోలీసుల వాగ్వాదం

## బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలే!

### సివిల్ కాంట్రాక్టర్స్ సంఘం ఆవేదన

ఖైరతాబాద్, మార్చి 7: పెండింగ్ బిల్లుల కోసం మంత్రులను కలిస్తే, ఆ ఒక్క విషయం మాట్లాడొద్దని చెప్తున్నారని సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. తల్లి, భార్య మెడలో ఉన్న బంగారం కుదువపెట్టి కాంట్రాక్టు పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో అప్పులపాలైన కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అసోసియేషన్ నాయకులు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లతో సహా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బిల్లులను ఈ నెల 20లోగా క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని, ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోతే, నిరసనలు, నిరాహారదీక్షలు, సచివాలయం ముట్టడి, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల ఘోష ప్రభుత్వానికి కనబడటం లేదా? అని ప్రశ్నించారు. తమకు అపాయింట్‌మెంట్ కూడా దొరికే పరిస్థితి లేదని వాపోయారు. అసోసియేషన్ సలహాదారు అజయ్ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ, పీఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఎస్‌డబ్ల్యూ తదితర శాఖల్లో రూ.10 లక్షలలోపు పనులు చేసిన కాంట్రాక్టర్లు సుమారు ఆరు వేల మంది ఉన్నారని, వీరికి చెల్లించాల్సిన బిల్లులు సుమారు రూ.500 కోట్లు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వంలోని ఓ పెద్దకు అడగ్గానే రూ.700 కోట్లు విడుదల చేశారని ఆరోపించారు.

## ప్రజాప్రభుత్వం అంటే పలాయనమా?: హరీశ్

ప్రజాప్రభుత్వం అంటే పలాయనం చిత్తగించడమేనా? అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కమీషన్ల కక్కుర్తి సచివాలయం సాక్షిగా బయటపడిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "తమది ప్రజాప్రభుత్వమని ప్రచారం చేసుకునే భట్టివిక్రమార్క.. బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్లు సచివాలయానికి వస్తే ఎందుకు పోలీసులను అడ్డుపెట్టుకొని వెనుక గేటు నుంచి వెళ్లిపోయారు? " అని నిలదీశారు. "సర్పంచ్‌లు రోడ్డెక్కినా ప్రభుత్వం కరుణించడం లేదు. కమీషన్లకు ఆశపడి మంత్రులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న వైనం కాంట్రాక్టర్ల ఆందోళనతో నిరూపితమైంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.6 వేల కోట్లు బాకీ పడింది. చెప్పులు అరిగేలా తిరుగుతున్నా, బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. సెల్ఫీ వీడియోలు పెడితేనో, కోర్టులకు వెళ్తేనో ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తున్నారు తప్ప నిబంధనల ప్రకారం రావాల్సిన వాటిని కూడా పెండింగ్‌లో పెడుతున్నారు" అని హరీశ్ ధ్వజమెత్తారు.

### రాహుల్‌గాంధీ స్పందించాలి

"ఢిల్లీలో తమ బాస్‌లకు కప్పం కట్టేందుకు అన్నివర్గాల నుంచి మంత్రులు లంచాలు తీసుకుంటున్నారని లోకం కోడై కూస్తున్నది. 20% కమీషన్ తీసుకుంటున్నారంటూ కాంట్రాక్టర్లే స్వయంగా సచివాలయానికి వచ్చి ధర్నా చేయడం గతంలో కనీవిని ఎరుగని ఘటన. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠకు మాయని మచ్చ. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే స్కాములు, కమీషన్ల ప్రభుత్వమని మరోసారి రుజువైంది. రాహుల్‌గాంధీ తాను చెప్పే నీతిసూత్రాలపై ఏమాత్రం నమ్మకం ఉన్నా తక్షణమే సచివాలయంలో కాంట్రాక్టర్లు.. మంత్రులపై చేసిన అవినీతి ఆరోపణలపై స్పందించాలి. కాంట్రాక్టర్లు చేస్తున్న తీవ్రమైన అవినీతి ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శక్తివంచన లేకుండా పోరాడుతున్నది. ప్రతీ వేదిక మీద కాంగ్రెస్ అవినీతిని సాక్ష్యాధారాలతో నిరూపించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం. బడా కాంట్రాక్టర్లకు కమీషన్లు తీసుకుని బిల్లులు చెల్లిస్తూ చిన్న కాంట్రాక్టర్లకు, మాజీ సర్పంచ్‌లకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఆపడం అన్యాయం. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన 'మనఊరు-మనబడి' కార్యక్రమం కింద చేపట్టిన పనులకు ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడం అమానుషం. తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి. కాంగ్రెస్ పాలనలో ఆర్థికశాఖ నుంచి జరిగిన అన్ని చెల్లింపులపై శ్వేతపత్రం విడుదలచేయాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

# సొరంగంలోకి రోబోటిక్ బృందాలు

- పరిస్థితిని సమీక్షించిన అన్వి నిపుణులు
- మద్రాస్ ఐఐటీ బృందంతో ఆపరేషన్
- బురదనీళ్లలో పసిగట్టని కేరళ జాగిలాలు
- టన్నెల్‌లో అనుకూలించని పరిస్థితులు
- 15వ రోజుకు చేరిన గాలింపు చర్యలు

మహబూబ్‌నగర్, మార్చి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదాన్ని పసిగట్టేందుకు మరో నిపుణుల బృందాన్ని శుక్రవారం ప్రభుత్వం రంగంలోకి దింపింది. నలుగురు సభ్యులతో కూడిన అన్వి రోబోటిక్ బృందం టన్నెల్‌లోకి వెళ్లి పరిస్థితిని సమీక్షించింది. నిపుణులతోపాటు ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు కూడా ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లి పరిస్థితిని అంచనా వేశారు. ప్రమాదం జరిగి 15 రోజులైనా టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది జాడ కోసం రెస్క్యూ బృందాలు తీవ్రంగా అన్వేషిస్తూనే ఉన్నాయి. కేరళకు చెందిన క్యాడవర్ డాగ్‌లను పంపినా బురద, నీటి ఊటల కారణంగా గుర్తించలేక వెనుదిరిగాయి. సొరంగం లోపల 13.65 కిలోమీటర్ల వద్ద ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి ర్యాట్ మైనింగ్ టీం తవ్వకాలు జరుపుతూనే ఉన్నాయి. సహాయ చర్యలకు టీబీఎం ఆటంకంగా మారింది. సుమారు 4 రోజులుగా తవ్వుతున్నా లోపలి నుంచి శిథిలాలు మాత్రమే బయటపడుతున్నాయి. ప్రమాదం జరిగిన చోట సొరంగమార్గం మరింత ప్రమాదకరంగా మారుతుందని రెస్క్యూ అధికారు లు తెలిపారు. నీటి ఊట, బురదతో సహాయ చర్యలకు ఆటంకం కలుగుతున్నదని, రోబోల సాయం తో కార్మికుల ఆచూకీ కనుక్కోవాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

### ఇంకా దొరకని నీటి ఊటల జాడ

సొరంగంపై భాగంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో నేషనల్ జియోలాజికల్ సర్వే టీం అటవీ శాఖ అధికారులతో కలిసి ముమ్మరంగా అన్వేషిస్తున్నది. ఎక్కడి నుంచి నీటి ధారాలు సొరంగంలోకి వెళ్తున్నాయో? ఆ ప్రదేశాన్ని గుర్తించేందుకు జల్లెడ పడుతున్నాయి. పైనుంచి నీటిని మళ్లించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

# సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాల ఎత్తివేత!

- సిరిసిల్ల నియోజకవర్గంలో మరో కక్ష్యసాధింపు చర్య
- 10లో 9మంది బీఆర్ఎస్ చైర్మన్లు ఉన్నారనే అక్కసు
- ఇటీవలే పాలకవర్గాల గడువు ఆరునెలల పొడిగింపు

సిరిసిల్ల రూరల్, మార్చి 7: సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులపై కక్షగట్టిన అధికార యంత్రాంగం మరో కుతంత్రానికి తెరలేపినట్టు తెలుస్తున్నది. నియోజకవర్గంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గంలోని పది పీఏసీఎస్‌లలో తొమ్మిదింటిలో బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే చైర్మన్లుగా ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్కసుతోపాటు పీఏసీఎస్‌లన్నీ బీఆర్ఎస్ శ్రేణుల చేతిలో ఉండటం వల్లనే యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పజెప్పేందుకు ఓ ఉన్నతాధికారి ఐకేపీ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. దీంతో ఐకేపీ అధికారులు సింగిల్‌విండోలు నిర్వహించే కేంద్రాల స్థానంలో మహిళా సంఘాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఇలా జరిగితే తమ పరిస్థితి ఏంటని సింగిల్‌విండో పాలకవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కేటీఆర్‌పై అక్కసుతో సింగిల్‌విండోలను దెబ్బతీయడం సరికాదని చైర్మన్లు వాపోతున్నారు.

### బీఆర్ఎస్‌పై కక్షతోనే

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సింగిల్‌విండో పాలకవర్గాలను ఆరు నెలలపాటు పొడిగిస్తూ.. ఉత్తర్వులు జారీచేసింది. సిరిసిల్ల జిల్లాలో తొమ్మిది మంది చైర్మన్లు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే ఉండటంతో ఏకంగా కొనుగోలు కేంద్రాలను ఊడగొట్టాలని చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొమ్మిది మంది చైర్మన్లలో ఇద్దరిపై భూ ఆక్రమణ కేసులుపెట్టి జైలుకు పంపించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇటీవల సిరిసిల్ల కేంద్రంలో కేటీఆర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీ ఉన్నందుకు అధికారులు ఓ టీస్టాల్‌ను మూసివేయించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల బీఆర్ఎస్ నాయకులతోపాటు జిల్లెల్లలో సామాన్య రైతు రాజిరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు.



### ఆలోచనను విరమించుకోవాలి



సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసే ఆలోచనను అధికారులు విరమించుకోవాలి. కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలి. గతంలో మహిళా సంఘాల సభ్యులు తాము నిర్వహించలేమని.. నిర్వహణ భారంతో ఇబ్బందిపడి కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. తర్వాత సింగిల్‌విండోలకు అప్పగించారు. అప్పటినుంచి రైతుల వద్దనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించాం. రైతులకు అందుబాటులో ఉన్న సొసైటీ కేంద్రాలను ఎత్తివేయవద్దు. రైతులను ఇబ్బందులకు గురి చేసే ఆలోచనను విరమించుకోవాలి.

- దేవదాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ (సిరిసిల్ల)



వికారాబాద్‌జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## కోర్టు తీర్పు కాపీ రాకముందే చెక్కుల పంపిణీ

- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

వికారాబాద్, మార్చి 7, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ప్రభుత్వం మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కు నిమిత్తం చేపట్టిన భూ సేకరణను నిలిపివేయాలని హైకోర్టు స్టే ఉత్తర్వులు వెలువడి 24 గంటలు కూడా కాకముందే అధికారులు శుక్రవారం కొందరు రైతుల నుంచి సమ్మతిపత్రాలు తీసుకొని పరిహారం చెక్కులను అందజేశారు. హకీంపేట పరిధిలోని సర్వే నంబర్ 252లోని 32 ఎకరాల భూసేకరణకు సంబంధించి 24 మందికి రూ.6.44 కోట్ల పరిహారాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అందజేశారు. హైకోర్టు ఉత్తర్వుల్లో ఏముందో తెలుసుకోకముందే అధికారులు ఇలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారుల తీరును రైతుల తరఫున హైకోర్టులో వాదించిన న్యాయవాదులు తప్పుపడుతున్నారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్‌ను రెండు వారాల్లోగా సమర్పించండి

### బీసీఐకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్‌ను 2 వారాల్లోగా సమర్పించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని హైకోర్టు ఆదేసించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ ప్రస్తుత సభ్యుల పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించడం లేదని న్యాయవాది అశోక్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ ఆదేశాలను జారీచేసిన హైకోర్టు.. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

## ఫోన్ల ట్యాపింగ్‌పై ఫిర్యాదు ఏ దశలో ఉందో చెప్పండి

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వ హయాంలో ఫోన్ల ట్యాపింగ్ జరిగిందనే ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలియజేయాలని సమాచార హక్కు చట్టం కింద కోరితే వివరాలు ఇవ్వడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో ఆ ఫిర్యాదు ఏ దశలో ఉందో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం కింద ఆ ఫిర్యాదు వివరాలను తెలియజేయకపోవడంపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

## సచివాలయ సందర్శన వేళల పెంపుపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): సచివాలయ సందర్శన వేళలను ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలన్న విన్నపంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిర్యాదుల స్వీకరణ కోసం సచివాలయ ప్రధాన ద్వారం వద్ద ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు సందర్శన సమయాన్ని పెంచాలని కోరుతూ ప్రజాహిత వ్యాజ్యం దాఖలవడంతో హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది.

## చట్టవిరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్ల సేకరణ

### మాజీ ఎంపీ ఉండవల్లి వాదన

### తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): డిపాజిట్ల సేకరణలో 'మార్గదర్శి' సంస్థ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని, ఈ తంతు గత 45 ఏండ్లుగా కొనసాగుతున్నదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ శుక్రవారం తెలంగాణ హైకోర్టులో వాదించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం 'మార్గదర్శి' అక్రమాలపై విచారణ కోసం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిందని, ఇప్పుడు ఏపీలోని టీడీపీ ప్రభుత్వంతోపాటు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ కే సుజన ధర్మాసనం ప్రకటించింది.